ప్రజాశక్తి

శుక్రవారం 28 జులై 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

పల్నాట అశాంతి

- తరచూ అదుపు తప్పుతున్న శాంతిభద్రతలు
- తాజాగా వినుకొండలో వైసిపి-టిడిపి ఘర్షణ
- పోలీసుల లాఠీఛార్జీ, గాలిలోకి కాల్పులు



మోహరించిన వైసిపి-టిడిపి శ్రేణులు.. గాలిలోకి కాల్పులు జరుపుతున్న సిఐ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తరచూ శాంతి భద్రతల సమస్య తలెత్తుతుంది. ఎన్నికలకు దాదాపు ఏడాది ముందు నుంచి వైసిపి, టిడిపి ఢీ అంటే ఢీ అంటున్నాయి. గతేడాది డిసెంబర్ 16న మాచర్లలో టిడిపి, వైసిపి మధ్య పెద్ద ఎత్తున ఘర్షణలు చెల్లరేగాయి. దాదాపు మూడు నెలల పాటు మాచర్ల పట్టణంలో 144 సెక్షన్ అమలు చేశారు. మాచర్ల, గురజాల, నరసరావుపేట వినుకొండ నియోజకవర్గాల్లో తరచూ ఘర్షణలు చోటు చేసుకుంటున్నా పోలీసులు ముందస్తుగా నిరోధించడంలో విఫలమవుతున్నారు.

వినుకొండలో గురువారం జరిగిన ఘర్షణలో పోలీసులు ముందస్తుగా కనీస జాగ్రత్తలు తీసుకోలేదని స్పష్టం అవుతుంది. తొలుత బస్టాండ్ వద్ద టిడిపి కార్యకర్తలు ర్యాలీ చేస్తుండగా అదే సమయంలో ఎమ్మెల్యే బోల్లా బ్రహ్మనాయుడు వాహనాన్ని అనుమతించారు. ఎమ్మెల్యే అదే మార్గంలో వెళ్లాలనుకుంటే టిడిపి వారినైనా ఆ మార్గంలో అనుమతించకుండా ఉండాల్సింది. లేదా ఎమ్మెల్యేను వేరే మార్గంలో నైనా పంపాల్సి ఉంది. అలాకాకుండా రెండు గ్రూపులను ఒకే మార్గంలోకి అనుమతించడం ద్వారా పోలీసుల ఘర్షణకు ఆస్కారం కల్పించారనే విమర్శలు వచ్చాయి. ఎమ్మెల్యే కారుపై టిడిపి కార్య కర్తలు రాళ్లు రువ్వారని పోలీసులు చెబుతుండగా ఎమ్మెల్యే బొల్లా మీసం మెలేసి రెచ్చగొట్టడం వల్లే ఘర్షణ జరిగిందని టిడిపి నాయకులు చెబుతున్నారు.

పల్నాడు జిల్లాలో కొన్ని నెలలుగా వైసిపి, టిడిపి కార్యకర్తలు తరచూ ఘర్షణలకు పాల్పడుతున్నారు. ఇటీవల నరసరావుపేటలో ఘర్షణలు జరిగాయి. టిడిపి నరసరావుపేట ఇన్‌ఛార్జి అరవిందబాబుతో పాటు పలువురు కార్యకర్తలు గాయపడ్డారు. మాచర్ల నియోజకవర్గంలో తరచూ ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. మాచర్లలో టిడిపి ఇన్‌ఛార్జిగా జూలకంటి బ్రహ్మారెడ్డి నియమితులైనప్పటి నుంచి టిడిపి కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసిపి, టిడిపి మధ్య తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. గతేడాది డిసెంబర్ 16న టిడిపి, వైసిపి కార్యకర్తల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ జరిగింది. చివరికి టిడిపి కార్యకర్తలు ఇళ్లపై వైసిపి కార్యకర్తలు దాడి చేసి దహనకాండ విధ్వంసాన్ని సృష్టించారు. ఈ ఘర్షణలో గాయపడిన టిడిపి కార్యకర్తలను పరామర్శించేందుకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌ను కూడా రానివ్వకుండా శాంతిభద్రతల సమస్యను సాకుగా చెప్పారు. మాచర్ల దాదాపు మూడు నెలల పాటు 144 సెక్షన్ కొనసాగింది. వినుకొండలో కూడా అదే రీతిలో ఘర్షణలను ప్రేరేపించి వచ్చే నెలలో జరగాల్సిన నారా లోకేష్ పర్యటన అడ్డుకోవడానికి వైసిపి నాయకులు కొత్రలు చేస్తున్నారని మాజీ మంత్రులు నక్కా ఆనంద బాబు కన్నా లక్ష్మీనారాయణ తీవ్ర

2లో



గురజాల తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వ్యవసాయ కూలీలు, దళితులు

భూములు పంచాలని ధర్నా

- గురజాలలో వ్యవసాయ కార్మిక సంఘం భూ సదస్సు
- పంచడానికి వీలున్న భూమలుపై అధికారులకు వినతి
- చర్లగుడిపాడు ఎస్సీలకు భూములివ్వకుంటే 15 రోజుల్లో ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటామని హెచ్చరిక

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

భూ పంపిణీని ప్రభుత్వం ఒక విధానంగా చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన భూ సదస్సు డిమాండ్ చేసింది. నియోజకవర్గ కేంద్రమైన గురజాలలో టి.శ్రీను అధ్యక్షత భూ సదస్సును గురువారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో పేదలకు భూ పంపిణీ చేయడానికి వేలాది ఎకరాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. చర్లగుడిపాడులోని దళితులకు చెందిన 300 ఎకరాల ప్రభుత్వ భూములను ఆ గ్రామంలోని దళితులకు పట్టాలిచ్చి పంపిణీ చేయాలన్నారు. అన్యాక్రాంతమైన అసైన్మెంట్ భూములను ప్రభుత్వం స్వాధీనం

2లో



తాడేపల్లి మండలం చిర్రావూరులో నీట మునిగిన పొలాలు

రైతుల్ని ముంచిన ముంపు

5లో

గోవాకు వెళ్లి వస్తూ మృత్యువాత


తెలంగాణలో జరిగిన ప్రమాదంలో సత్తెనపల్లికి చెందిన ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణానికి చెందిన వారు విహార యాత్ర కోసం గోవాకు వెళ్లి తిరిగివస్తుండగా తెలంగాణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మరో ఇద్దరు గాయపడగా వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల బంధువుల వివరాలు ప్రకారం.. సత్తెనపల్లిలోని వాసులు లక్ష్మీ టాకీస్ ప్రొప్రైటర్ షేక్ షుకూరు (50), షేక్ బాషా అలియాస్ బేకరీ సైదా (50), మరోకరితో కలిసి నాలుగు రోజుల కిందట గోవా పర్యటన నిమిత్తం కారులో వెళ్లారు. యాత్ర ముగించుకొని తిరిగి వస్తుండగా గురువారం తెల్లవారుజామున వీరి వాహనం తెలంగాణ రాష్ట్రంలోని నారాయణపేట జిల్లా ముక్తల్ మండలం గుడిగండ్ల వద్ద 167వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలు అతివేగంగా ఢీకొట్టింది. షుకూరు, బాషాలు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. వాహనం నుజ్జునుజ్జు అయ్యింది. విషయం తెలుసుకున్న బంధువులు హుటాహుటిన మహబూబ్‌నగర్‌కు వెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం సత్తెనపల్లికి శుక్రవారం తీసుకొస్తారని తెలిపింది. మృతుడు షుకూరుకు భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భాషకు భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు.



మృతులు షుకూర్, బాషా (ఫైల్)



మిర్చి నర్సరీపై గడ్డిమందు

ప్రజాశక్తి పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని మిరప నర్సరీపై గడ్డి మందు ప్రయోగించినట్లు బాధిత రైతులు కోటయ్య, గంగయ్య గురువారం తెలిపారు. నీటి వసతి ఉన్న చోట ఎకరంన్నరలో 15 మంది రైతులు కలిసి నర్సరీలు ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై మంగళవారం రాత్రి గడ్డి మందులను ఎవరో చల్లారని రైతులంటున్నారు. సుమారు 5 కిలోల విత్తనాలు నాటామని, క్లాసిక్, 327 విత్తనాలు దొరక అదనంగా ధర చెల్లించి బ్లాక్ మార్కెట్లో వాటిని కొనుగోలు చేసి 15 రోజుల కిందట నాటామని చెబుతున్నారు. పూర్తిస్థాయిలో ఎండ వస్తేనే ఎంత నష్టం అనేది తెలుస్తుందని, దీనిపై అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



గుంటూరులో నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులు

స్పందించకుంటే నిరవధిక సమ్మె

2లో

ఇద్దరు బిఎల్‌ఓలు సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఎల్.ఆర్.కాలనీ, రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న డోర్ టు డోర్ ఓటర్ సర్వేను కమిషనర్ గురువారం పరిశీలించారు. బిఎల్‌ఓల పనితీరు గమనించి విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఎల్‌ఆర్ కాలని 203 పోలింగ్ స్టేషన్ బిఎల్‌ఓ జి.రమేష్‌బాబు, రాజీవ్ గాంధీ నగర్ 46 పోలింగ్ స్టేషన్ బిఎల్‌ఓ బి.రఘుబాబును విధుల నుండి సస్పెండ్ చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 ఓటర్ల జాబితాకు సంబంధించి డోర్ టు డోర్ సర్వేను బిఎల్‌ఓలు పక్కాగా చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సూపర్వైజరి అధికారులు మరింత భాధ్యతగా సర్వేని పర్యవేక్షించాలన్నారు. పర్యటనలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, రవీంద్ర పాల్గొన్నారు.

రైతు యాత్రకు తరలి రండి

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

గుంటూరు ఛానల్ పొడిగింపు పనులకు నిధులు కోరుతూ ఆగస్టు 1వ తేదీన తలపెట్టిన రైతు యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు మహిళా రైతులు పెదనందిపాడు కాకుమాను మండల గ్రామాలు వరగాని. అన్నపర్రు, అబినేని గుంట పాలెం, కొమ్మూరు, పెద్దివారిపాలెం, గార్లపాడు గ్రామాల్లో రైతులను కలుసుకొని వారికి రైతు యాత్ర గురించి వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో డాక్టర్ కొల్లా రాజమోహనరావు, పోపూరి వెంకటప్పయ్య, పెద్ది పెద్దన్న , మర్రిశెట్టి శ్రీను, కొల్లా సాంబశివరావు, వడ్లమూడి బాపయ్య, బండి నాగేశ్వరావు, కొల్లా నిర్మల రామన్, ఈదర భ్రమరాంబ, లావు చౌడేశ్వరి, తుమ్మల సరళ, రమాదేవి, జాష్టి వీరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.



భూములు పంచాలని ధర్నా

(మొదటిపేజీ తరువాయి)

చేసుకొని తిరిగి పేదలకు పంపిణీ చేయాలని, అటవీ సరిహద్దుల్లో ఉన్న అన్ సర్వే భూములను సర్వే చేసి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. సిమెంట్ ఫ్యాక్టరీలు కడతామని చెప్పి రైతుల వద్ద తీసుకున్న భూములను ఫ్యాక్టరీలు కట్టలేదదని, వాటిని రైతులకు తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. గురజాల నియోజకవర్గంలోని దేవాలయ భూములు భూమిలేని పేదలకు నామ మాత్రపు కౌలుకు ఇవ్వాలని, కౌలు ప్రభుత్వం చెల్లించాలని కోరారు. పేదల స్వాధీనంలో ఉన్న పోరంబోకు, బంజరు భూములకు రెవెన్యూ రికార్డుల పరంగా హక్కులు కల్పించాలని, భూసీలింగ్ చట్టం ప్రకారం పునర్విచారణ చేపట్టి భూ పంపిణికి అదనపు భూములు రాబట్టాలని ప్రభుత్వానికి సూచించారు. అనుమతులు లేకుండా వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుస్తున్న, వ్యాపారాన్ని అరికట్టాలన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల ప్రకారం భూమిలేని ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి రెండు ఎకరాలు సాగు భూమి ఇవ్వాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వీరికి మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ చర్లగుడిపాడులోని 300 ఎకరాలు నానమ్మ చెరువుకు చెందిన ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని కోరుతూ 6 నెలలుగా అధికారులు చుట్టూ తిరుగుతున్నామని, ఇంతవరకు ఈ భూములు ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి కేటాయించారా? కేటాయించలేదా? అధికారులు చెప్పలేకపోయారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చర్లగుడిపాడు దళితులు చెప్పినట్లు ఈ భూమి విద్యాలయానికి కేటాయించలేదు కనుక ప్రభుత్వం స్వాధీనం చేసుకొని వెంటనే ఆ గ్రామ దళితులకు పంపిణీ చేయాలన్నారు. 15 రోజుల్లోగా విశ్వవిద్యాలయానికి భూమి కేటాయించినట్లు రుజువు చేయలేకపోతే భూ పంపిణీ కోసం ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ప్రకటించారు. కార్యక్రమంలో పి.ఆదాం, కె.అక్కులు, బి.సువర్ణబాబు, కె.యలమంద, పి.మరియదాసు, పి.బంగారమ్మ, పి.దానమ్మ, పి.వజ్రం, పి.చినబాబు, పి.రాణమ్మ, పి.రమేష్, వి.ఏసుబాబు, కోటేశ్వరరావు, వ్యవసాయ కూలీలు, చర్లగుడిపాడు దళితులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలకు నేతల పరామర్శ

ఎమ్మెల్యే బొల్ల వల్ల ఘర్షణలు : మాజీ మంత్రులు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

వినుకొండ పట్టణంలో వైసిపి నేతల దాడుల్లో గాయపడిన టిడిపి కార్యకర్తలను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మాజీ మంత్రులు నక్కా ఆనంద బాబు, కన్నా లక్ష్మీ నారాయణ, వినుకొండ మాజీ ఎమ్మెల్యే జి.వి. ఆంజనేయులు, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ళ నరేంద్ర, తూర్పు నియోజకవర్గం ఇంచార్జి నసీర్ అహ్మద్, తెలుగుదేశం పార్టీ నాయకులు డేగల ప్రభాకర్, మద్దిరాల మాని, కనపర్తి శ్రీనివాస రావు, బుచ్చి రామ్ ప్రసాద్, దారు నాయక్ తదితరులు గురువారం రాత్రి పరామర్శించారు.



గుంటూరు జిజిహెచ్ వద్ద మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు

ఈ సందర్భంగా దాడిలో గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ వినుకొండలో టీడీపీ కార్యకర్తలపై దాడులను హేయమని అన్నారు. జీవీ ఆంజనేయులపై కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. ఎమ్మెల్యే బొల్లా దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారని, యువగళాన్ని అడ్డుకోవడానికే ఎమ్మెల్యే కుట్రలు చేస్తున్నారని అన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా లోకేశ్‌ను అడ్డుకోలేరన్నారు. వైసీపీ ప్రజా ప్రతినిధులు వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ ఎమ్మెల్యేలు, ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు మండి పడ్డారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే తీరు కారణంగా శాంతి భద్రతల సమస్య వస్తుంటే...నివారించాల్సిన పోలీసులు తిరిగి తెలుగు దేశం కార్యకర్తలపైనే లాఠీచార్జ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. వైసీపీ చిల్లర వేషాలకు టీడీపీ కార్యకర్తలు భయపడరని అన్నారు.

స్పందించకుంటే నిరవధిక సమ్మె

గుంటూరు, తెనాలిలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ ఉద్యోగుల నిరసనల్లో భాగంగా రాష్ట్ర విద్యుత్ ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్ వద్ద కార్యనిర్వాహక, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. నల్లరిబ్బన్లు, ప్లకార్డులు ధరించి నినాదాలు చేశారు. జెఎసి నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన హక్కుల కోసం ఏడాది కాలంగా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా స్పందనా లేదన్నారు. ఇప్పటి నుండి ఆగస్టు 9 వరకూ పలు రూపాల్లో నిరసనలు తెలిపి, అప్పటికీ యాజమాన్యం స్పందించకపోతే ఆగస్టు 10 నుండి నిరవధిక సమ్మెలోకి వెళతామని తెలిపారు. కార్యక్రమంలో జెఎసి చైర్మన్ ఆంజనేయుల అధ్యక్షత వహించగా, సెక్రెటరీ రాజేష్‌కన్నా, కన్వీనర్ రవిశంకర్ ప్రసంగించారు.

ప్రజాశక్తి-తెనాలి : చెంచుపేట విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద నిరసనలో నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు 2022 పిఆర్‌సి అమలు చేయాలని, కాంట్రాక్ట్ సిబ్బంది సర్వీసులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇపిఎఫ్‌ను జిపిఎఫ్‌గా మార్చాలని, జెఎల్‌ఎం గ్రేడ్ 2 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పెండింగ్ డిఎ బకాయిలను చెల్లించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే సమ్మెకు వెళతామని హెచ్చరించారు. నిరసనలో జెఎసి సెక్రటరి పివి సుధీర్, నాయకులు మల్లికార్జునరావు, కరీమ్ బాషా, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



తెనాలిలో నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

పల్నాట అశాంతి

(మొదటిపేజీతరువాయి)







స్థాయిలో ధ్వజమెత్తారు. గతేడాది కాలంలో పలనాడు ప్రాంతంలో రాజకీయ వైషమ్యాలు, ఫ్యాక్షన్ తరహా దాడులు పెరుగుతున్నాయి. అయితే పోలీసులు పలు సంఘటనలో జరిగిన ఘర్షణలు, హత్యలు అన్ని వ్యక్తిగత కారణాలుగా పేర్కొంటున్నారు. వినుకొండలో తనను అంతమొందించేందుకు టిడిపి నాయకులు కుట్ర చేస్తున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తీవ్రంగా ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఈసారి తాడోపేడో తేల్చుకునేందుకు టిడిపి నాయకులు అన్ని నియోజకవర్గాల్లో వైసిపితో ఢీ అంటే ఢీ అనే స్థాయికి చేరుకుంటున్నారు. ఎన్నికలకు దాదాపుగా ఏడు ఎనిమిది నెలలు ముందే ఈ విధంగా ఘర్షణలు జరిగి శాంతిభద్రత సమస్య తలెత్తితే ఎన్నికల సమయానికి పరిస్థితి ఎలా ఉంటుందో నిఘావర్గాలకు కూడా కష్టతరమవుతోంది.

రోడ్డు విస్తరణలో భవన యజమానులను

భయపెడుతున్న వైసిపి : ధూళిపాళ్ల



ప్రజాశక్తి -పొన్నూరు రూరల్ : రోడ్డు విస్తరణ పేరుతో వైసిపి నేతలు భవన యజమాలను బెదిరించాలని చూస్తే సహించేది లేదని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. గురువారం పొన్నూరు టిడిపి కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. పొన్నూరు పట్టణంలో రోడ్డు విస్తరణ నిర్వాసితులను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, వైసీపీ నేత షేక్ సైపుల్లా, వారి అనుచరులు భవన యజమానులను ఒంటరిగా తిరగవద్దని మా ఎమ్మెల్యే సంగతి మీకు తెలియదని భయపెట్టేందుకేనా మీకు పొన్నూరు ప్రజలు ఓటు వేసి గెలిపించిందని నరేంద్ర కుమార్ ప్రశ్నించారు. నిజంగా పట్టణ అభివృద్ధి, రోడ్డు విస్తరణ పై ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే ఎందుకు రహస్య ప్రయత్నం సాగిస్తున్నారని, దానిని ప్రజల ముందు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఒక జిబిసి రోడ్డుకు పరిమితం కాకుండా అత్యంత రద్దీగా ఉండే యస్‌పిపి రోడ్‌లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని యస్ పి పి రోడ్డు విస్తరణ ఎందుకు చేపట్టడం లేదో తెలియజేయాలని డిమాండ్ చేశారు. గాంధీ బొమ్మ సెంటర్లోని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి వెనుక ఉన్న అక్బల్ బంగారు షాపు, దాని వెనుక ఉన్న హైదరాబాద్ టైలర్ షాపుకు కూడా విస్తరణలో పోతుందని నోటీసులు ఇవ్వడం ఆశ్చర్యాన్ని గురి చేస్తుందన్నారు. పొన్నూరు పట్టణ నడిబొడ్డు ఐలాండ్ సెంటర్లో యస్‌పిపి రోడ్ లోనికి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందికరంగా ఉన్న వైసిపి నాయకుడు సైపుల్లా భవనం విస్తరణ నోటీసులు ఎందుకు జారీ చేయడం లేదో తెలియజేయాలని డిమాండ్ చేశారు. బాండ్స్ రూపంలో పరిహారాన్ని ఇవ్వటానికి తాము వ్యతిరేకమని, బాధితులకు నగదు రూపంలో ఇవ్వటానికి టిడిపి అనుకూలమని ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ తెలియజేశారు. బాధితులను సైపుల్లా, చోటామోటా వైసిపి నాయకులు బెదిరించాలని చూస్తే బాధితుల పట్ల టిడిపి పోరాడి తీరుతుందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు చిత్తశుద్ధి ఉంటే ది.04.04.2022 సంవత్సర సమావేశంలోని మినిట్స్ వివరాలను ప్రజలకు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ మాదాల వెంకటేశ్వరరావు, పొన్నూరు నియోజకవర్గం ఎస్సీ మరియు మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎద్దు సోంబాబు మరియు పఠాన్ ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో మెరుగైన చికిత్సలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి కాన్పుల వార్డుకు వచ్చే ప్రతి ఒక్కరికి ఆరోగ్యమైన సేవలు అందిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ వై. కిరణ్ కుమార్ అన్నారు. ఆసుపత్రి తనిఖీల్లో భాగంగా గురువారం కాన్పుల వార్డును ఆయన పరిశీలించారు. కాన్పుల వార్డులో వైద్య సేవలు ఏవిధంగా అందుతున్నాయని రోగుల సహాయకులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్ళితే లక్షలకు లక్షలు ఖర్చు అవుతుందని ప్రభుత్వ ఆసుపత్రి కి వస్తే అన్నీ రకాల సేవలు ఉచితంగా చేస్తామని ఆయన చెప్పారు. నాట్కో చిన్న పిల్లల విభాగం ఐ సి యు నిర్వహణ పై అసంతప్తి వ్యక్తం చేశారు. చిన్న పిల్లల వార్డును ఎంతో పరిశుభ్రంగా అందించాల్సిన బాధ్యత మన పై ఉందని డాక్టర్ కిరణ్ కుమార్ సహచర వైద్యులకు సూచించారు.ఐ సి యు పూర్తిగా అధ్వానంగా మారింది. సరైన శుభ్రత కనిపించడం లేదు. పీజీ వైద్య విద్యార్థి కి డ్రెస్ కోడ్ కూడా లేదు. చిన్నారులకు చల్లదనం లేదని ఆయన అసంతప్తి వ్యక్తం చేశారు. శానిటేషన్ సిబ్బంది సరిపడా లేకపోవడం తో ఐ సి యు డస్ట్ బిన్ లా మారిందని ఆయన అన్నారు. నాలుగు వార్డులకు కలిపి ఒకరు మాత్రమే పని చేస్తున్నారని ఆయన చెప్పారు.ఈ విభాగం లో ఫ్లోరింగ్, టైల్స్, అందమైన హాలు అందుబాటులో ఉన్నప్పుడు పరిశుభ్రత పాటించక పోవడం పై ఆయన శానిటేషన్ సూపర్ వైజర్ పై మండిపడ్డారు. అనవసరమైన వస్తువులు ఐ సి యు లో ఉండటాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. దీర్ఘకాలిక వ్యాధు ల పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తల్లితండ్రులకు ఆయన భరోసా కల్పించారు. పిఎసియు వార్డు కు పై భాగాన బ్రిక్స్ రాయి తో గోడలు కట్టి శాశ్వతంగా రేకుల షెడ్డు ను ఏర్పాటు చేయాలనీ ఆయన సూచించారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్ యం ఒ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి రమాదేవి, ఇంజనీర్ చంద్ర శేఖర్ ఉన్నారు.



రోగుల సహాయకులతో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్ కుమార్

జిల్లాలో 47 మందికి విదేశీ విద్యాదీవెన

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో 47 మందికి విదేశీ విద్యాదీవెన పథకం కింద రూ.5,13,23,869లు మంజూరు అయ్యాయి. గురువారం తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం నిధుల మంజూరును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గుంటూరు కలెక్టరేట్ నుండి శాసన మండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, సోషల్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ గనిక ఝాన్సీ , జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, జిఎంసి డిప్యూటీ మేయర్ సజీలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మారెడ్డి మాట్లాడుతూ ప్రతిభ వుండి కూడా, స్తోమత లేక ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో సిఎం జగన్మోహన్‌రెడ్డి విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా పేద విద్యార్థులకు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. అనంతరం ఈ పథకం కింద 2022-23 సంవత్సరానికి 36 మందికి, 2023-24 సంవత్సరానికి 11 మంది మొత్తం 47 మంది ఎస్సీ, బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ విద్యార్థులకు రూ.5,13,23,869ల మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ డిడి మధుసూధనరావు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి సువార్త, లబ్దిదారులు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.



మెగా చెక్కు అందచేస్తున్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, తదితరులు

నిద్రిస్తున్న వ్యక్తిపై మహిళ దాడి

ప్రజాశక్తి - నకరికల్లు :నిద్రిస్తున్న వ్యక్తిపై సహజీవనం చేస్తున్న మహిళ కాగుతున్న నూనె వేయడంతో తీవ్ర గాయాలైన సంఘటన నకరికల్లు లోని యానాది కాలనీలో చోటుచేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ గురువారం తెలిపిన వివరాల ప్రకారం నకరికల్లు గ్రామానికి చెందిన వంటమాస్టర్ ఆతుకూరి నాగరాజు అదే గ్రామానికి చెందిన జగన్నాథ నాగమణితో గత ఏడు సంవత్సరాలలగా సహజీవనం చేస్తున్నాడు. నాగమణికి పిల్లలు పుట్టరని తెలుసుకున్న నాగరాజు అదే కాలనీలో నివాసం ఉంటున్న మహిళతో వివాహేతర సంబంధం కలిగి పెళ్లి చేసుకుంటానన్నాడు. ఈ విషయంపై నాగమణి, నాగరాజుల మధ్య గత కొంతకాలంగా ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. బుధవారం ఉదయం వై జంక్షన్‌లోని గోల్డెన్‌టీ కేఫ్‌లో వంటపని ముగించుకొని మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చి అన్నం తిని నిద్రపోతుండగా కాలుతున్న నూనె వేయడంతో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జి జి హెచ్‌కు తరలించినట్లు తెలిపారు. నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బాలకృష్ణ తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని పనుల్లో జాప్యం లేకుండా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ శ్యామలా నగర్ రోడ్డులోని ఎన్‌టిఆర్ మున్సిపల్ స్టేడియం స్విమ్మింగ్ పూల్, ఉద్యోగ నగర్ పార్క్, ఎస్.వి.ఎన్.కాలనీ పార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పార్కులు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు టెండర్ పొంది పనులు నిర్దేశిత గడువు మేరకు పని చేయట్లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి కాంట్రాక్టర్లపై, పర్యవేక్షణ ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటా మన్నారు. శ్యామలా నగర్ రోడ్డులోని మున్సిపల్ స్విమ్మింగ్ పూల్ ప్రాంతంలో పార్క్ అభివద్ధికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఏ.ఈ.ని ఆదేశించారు. ఉద్యోగ నగర్ పార్క్‌ని పరిశీలించి పనులకు ఆమోదం వచ్చినా ప్రారంభించక పోవడంపై ఇంజినీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేసి, సోమవారం నుండి పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. పార్క్ ప్రాంతంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న సిసి రోడ్డుపై స్థానికుల ఫిర్యాదు మేరకు పరిశీలించి, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించబోమన్నారు. ఎస్.వి.ఎన్.కాలని పార్కులో వాకింగ్‌ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పెట్టాలని, పార్కులో మరమ్మతుకు గురైన ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఎక్విమెంట్‌కు మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఏ.ఈ.ని ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ డి.రవీంద్ర, ఈ.ఈ. సుందర్రామిరెడ్డి, ఏడిహెచ్ రామారావు, డి.ఈ.ఈ. మహ్మద్ రఫిక్, ఎస్.ఎస్. సోమ శేఖర్, ఏ.ఈ. సూరిబాబు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

గంజాయి విక్రయదారులపై ఉక్కుపాదం : ఎస్‌పి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా గంజాయి విక్రయం, వినియోగం, సరఫరా అరికట్టడానికి బృహుత్తర ప్రణాళికలు రూపొందించి, జిల్లా వ్యాప్తంగా ప్రతిపోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని వెల్లడించిన జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడచిన మూడు సంవత్సరాలలో జిల్లాలో 293 గంజాయి కేసులలో 670 మందిని అరెస్ట్ చేసి 4158.008 కేజీల గంజాయిని, 9. 084 లీటర్ల గ్రాముల ద్రవరూప గంజాయిని సీజ్ చేశామన్నారు. అక్రమార్కులు ఏ విధంగా గంజాయిని సరఫరా చేసినా వారి వ్యూహాల గురించిన సమాచారాన్ని క్షణాల్లో పసిగట్టేలా పటిష్ఠ సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాతనేరస్తులు, అనుమానితుల కదలికలు ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉంటాయని, కావున చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే సరైన రీతిలో చర్యలు ఉంటాయని తెలిపారు. గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న 11 మందిపై పిడి చట్టం కింద కేసులు నమోదు చేసి, రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించామని చెప్పారు. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వెస్ట్ డివిజన్ డిఎస్‌పి ఉమామహేశ్వర రెడ్డి, ట్రాఫిక్ డిఎస్‌పి బాల సుందర రావు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి సుభాష్, స్పెషల్ బ్రాంచ్ సిఐ నరసింహ రావు పాల్గొన్నారు.





ధ్రువీకరణ పత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-గుంటూరు :అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్ అన్నారు. గురువారం నెహ్రూనగర్, గుజ్జనగుండ్ల, అరండల్‌పేట, శివనాగరాజు కాలనీల్లో జరిగిన జగనన్న సురక్ష క్యాంప్‌ల్లో వారు పాల్గొని ప్రసంగించారు. అనంతరం లబ్దిదారులకు ధృవీకరణ ప్రత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీన పించన్ ఇంటి వద్దకే వచ్చి వాలంటీర్లు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్ర బాబు, స్టాండిగ్ కమిటి సభ్యులు, కార్పొరేటర్ మల్లవరపు రమ్య, అయిశెట్టి కనక దుర్గ, అంబేద్కర్, వంశీ, రవి, మల్లిబోయిన శ్రీవల్లి, డిప్యూటి కమీషనర్లు సిహెచ్.శ్రీనివాస్, రవీంద్ర, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి - అచ్చంపేట

రోడ్డు ప్రమాదంలో గ్రంథ సిరి గ్రామానికి చెందిన దొప్పలపూడి కిరణ్ (25) సునీల్ (23) మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి అచ్చంపేట గ్రామ పరిధిలోని దోసపాటి చెరువు వద్ద జరిగింది, వీరితోపాటు మరియా కుమారి అనే మహిళ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెరుకుంపాలెం గ్రామంలో చిలక కమలమ్మ అనే వృద్ధురాలి అంతిమ యాత్రకు బంధువులైన గ్రంథసిరి గ్రామానికి చెందిన కిరణ్, సునీల్, మరియకుమారి వచ్చారు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో దోసపాడు చెరువు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం లారీ ఢీకొట్టడంతో కిరణ్, సునీల్ అక్కడికక్కడే మృతి చెందారు మరియకుమారికి తీవ్ర గాయాలు కావడంతో గుంటూరు తరలించారు. అచ్చంపేట ఎస్ఐ సిహెచ్ మణికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం తరలించారు.



ఉండవల్లి పొలాల్లో భారీ కొండచిలువ

ప్రజాశక్తి-తాడేపల్లి :ఉండవల్లి గుహల సమీపంలోని విద్యుత్ ఉప కేంద్రం వద్ద పంట పొలాల్లో 30 అడుగుల భారీ కొండచిలువ సంచరిస్తుంది. తెల్లవారుజామున పూలుకోవడానికి వెళ్లే రైతులు, కూలీలు దానిని చూసి భయబ్రాంతులకు గురవుతున్నారు. రోజూ ఏదో ఒక సమయంలో ఈ ప్రాంతంలోనే కొండచిలువ రోడ్డు దాటడాన్ని తాము చూస్తున్నామని స్థానికులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు స్పందించి కొండచిలువను అటవీ ప్రాంతంలో వదలాలని కోరారు.

కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా ఎరువుల దుకాణాలు

ప్రజాశక్తి - తాడికొండ :ప్రముఖ ఎరువుల ఉత్పత్తి సంస్థ పారాదీప్ ఫాస్పెట్ లిమిటెడ్ విజయవాడ వారి ఆధ్వర్యంలో శ్రీ చంద్ర ఎంటర్ప్రైజెస్ సహకారంతో ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి మరియు రైతు అవగాహన సదస్సు గురువారం మండలంలోని పొన్నేకల్లు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పారాదీప్ ఫాస్పెట్ లిమిటెడ్ మార్కెటింగ్ ఆఫీసర్ పివి సుభాష్ మాట్లాడుతూ రైతులకు అండగా వుండే విధంగా ఈ పథకం అమలు లక్ష్యం అని అన్నారు. ఎరువుల సబ్సిడీలలో దేశవ్యాప్తంగా ఒకే ఎరువు ఒకే బ్రాండ్ భారత్ పేరుతో రైతులు శ్రమ లేకుండా తీసుకొవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరసింహారావు, శ్రీ చంద్ర ఎంటర్ప్రైజెస్ ప్రొప్రైటర్ పి రామారావు తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాంకు నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి :మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఎనిమిదో వర్ధంతి సందర్భంగా గురువారం తాడేపల్లి టిడిపి కార్యాలయంలో పట్టణాధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక ఆలోచనలను రేకెత్తించే అనేక విషయాలను ఆయన ప్రజలతో పంచుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎం.సత్యనారాయణ, పెంచలయ్య, ఎ.మురళీ, కె.నాగమల్లేశ్వరరావు, ఇట్టా భాస్కర్, డి.రామారావు, గోపి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

భవన నిర్మాణ కార్మికునికి ఘన నివాళి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని రావిపాడుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు కొమ్ముల ఏసోబు (72) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. భౌతికకాయాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి సిలార్ మసూద్, నరసరావుపేట పట్టణ కార్యదర్శి కె.కోటిరెడ్డి, నాయకులు పఠాన్ మస్తాన్‌వలి, ఏసోబు గురువారం సందర్శించి నివాళులర్పించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు కాగా ఒక కుమారుడు సురేష్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు.

ఈపూరు తహశీల్దార్‌గా ఎవి సుధాకర్

ప్రజాశక్తి–ఈపూరు



ఈపూరు తహశీల్దారుగా అచ్యుత వెంకట సుధాకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన బొల్లాపల్లి తహసీల్దారుగా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై ఈపూరుకు వచ్చారు. ఇప్పటివరకూ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా డిప్యూటీ తహశీల్దార్ ఆర్.వెంకటేశ్వర్లు వ్యవహరించారు.



వాటర్ ఎయిడ్ ఇండియా నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం పశువేములలో వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ నిర్మించిన గ్రే వాటర్ సిస్టంను ఎంపిడిఒ కోటేశ్వరావు గురువారం పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన ఛాంబర్స్ ద్వారా వర్షపు నీటి నిల్వ, 'వాటర్ స్టోరేజ్ ట్యాంక్ మరమ్మతుల పనితీరును పరిశీలించారు. వాటర్ ఎయిడ్ ఇండియా ఐఎస్ మాడెబోయిన గురుప్రసాద్ మాట్లాడుతూ అన్ని నిర్మాణాలు సక్రమంగా పనిచేయటం కోసం ప్రతి నిర్మాణానికి ఒక ఆపరేషన్ నిర్వహణ కమిటీ ఉందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబులాల్ నాయక్, వాటర్ ఎయిడ్ ఇండియా ఇంజినీర్ పవన్ కుమార్, సిఎఫ్ రవివర్మ, సర్పంచ్ దేవదానం, మాజీ సర్పంచ్ కె.చిన్నరంగయ్య పాల్గొన్నారు.

వేరుకుళ్లు నివారణకు సూచనలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మిరప నర్సరీలో వేరు కుళ్లు రాకుండా బైటెక్స్ ద్రావణాన్ని పిచికారి చేయాలని వ్యవసాయ శాఖ సహాయకులు బాజీ, ధనలక్ష్మి అన్నారు. గురువారం మిరప నర్సరీలను వారు పరిశీలించారు. నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. నర్సరీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.



మణిపూర్ అల్లర్లకు బిజెపియే బాధ్యత వహించాలి

- ఓట్ల రాజకీయమే ఏకరూప పౌరస్మృతి
- సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య
- బైపాస్ రోడ్డు బాధితలకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న గద్దె చలమయ్య

ప్రజాశక్తి–సత్తెనపల్లి

మణిపూర్‌లో స్త్రీలను నగ్నంగా ఊరేగించడాన్ని ప్రజలంతా తీవ్రంగా ఖండించాలని సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య పిలుపునిచ్చారు. స్థానిక పుతుంబాక భవన్‌లో గురువారం జరిగిన సిపిఎం పట్టణ కమిటీ సమావేశానికి కట్ట శివదుర్గరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చలమయ్య మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు బిజెపియే బాధ్యత వహించాలన్నారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఓట్లను కొల్లగొట్టేందుకే ఏకరూప పౌరస్మృతి బిల్లును తెస్తోందని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితులలో ఇది సరైనది కాదని, దేశ సమైక్యతకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వెలిబుచ్చారు. దీనికి బదులుగా దేశంలో పేదరికం నిర్మూలించేందుకు, మహిళలకు సమానమైన హక్కులు కల్పించేందుకు, ఆర్థిక, సామాజిక, మహిళా సమానత్వాన్ని సాధించేందుకు ప్రయత్నం చేయాలని హితవు పలికారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ సత్తెనపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణం భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ప్రస్తుతం జరుగుతున్న వాస్తవమైన కొనుగోలు అమ్మకాలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన రేట్లు తీవ్ర అన్యాయంగా ఉన్నాయని, కలెక్టరు రైతులను ప్రత్యక్షంగా సంప్రదించి రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయ నాయక్, పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులు ఎ.వీరబ్రహ్మం, ప్రభాకర్, బి.భాస్కరరావు, జె.రాజ్‌కుమార్,షేక్ సైదులు పాల్గొన్నారు.



రొంపిచర్లలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మణిపూర్ ఘటనపై మండల కేంద్రమైన రొంపిచర్లలోని చెరువుకట్ట సెంటర్లో గ్రామస్తులు గురువారం నిరసన తెలిపారు. బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎస్.తిమ్మరాజు మాట్లాడుతూ మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ రాష్ట్రంలో అల్లర్లు జరగకుండా రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. కార్యక్రమంలో ఎం.వెంకటేశ్వరరావు, అంజయ్య, చౌడయ్య, పి.రామిరెడ్డి పాల్గొన్నారు.



టెయిల్‌పాండ్‌లో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -రెంటచింతల

తమకు పిఆర్‌సిని అమలు చేయాలని విద్యుత్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సత్రశాలలోని టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులోని వందమందికిపైగా ఉద్యోగులు పరిపాలన భవనం ఎదుట గురువారం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. జెఎసి కన్వీనర్ సుబ్బారావు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, కారుణ్య నియామకాలను చేపటి పని ఒతిడితగ్గించాలని కోరారు. అనంతరం ఇఇ కొడాలి శ్రీకాంత్, డిఇ నాగరాజుకు వినతి పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో జెఎసి చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ మల్లేష్, జానీబాషా, కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, సుగుణరావు పాల్గొన్నారు.



పల్నాడులో 18 మందికి విదేశీ విద్యాదీవెన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

విదేశీ విద్యా దీవెనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి రెండో విడత విదేశీ విద్యా దీవెనను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌ఎ, ఎమ్మెల్యే, జిల్లా సంఘిక సంక్షేమ అధికారి ఓబుల నాయుడు, లబ్ధిదారులు పాల్గొన్నారు. పల్నాడు జిల్లాకు సంబంధించి 18 మందికి రూ.1.57 కోట్ల అందించినట్లు కలెక్టర్ తెలిపారు. వి.సాయి ప్రశాంత్‌కు రూ.14,34,395, వై.సాయి అరవింద్‌కు రూ:15,91,631 మంజూరు కాగా లబ్ధిదార్లతో కలెక్టర్ మాట్లాడి వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మెగా చెక్కును అందించారు.

జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా 11 రకాల సేవలు

గురజాల ఆర్‌డిఒ అద్దయ్య



ప్రజాశక్తి–పిడుగురాళ్ల

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలు ఉచితంగా ప్రజలకు అందుతున్నాయని గురజాల రెవెన్యూ డివిజనల్ అధికారి అద్దయ్య అన్నారు. గురువారం పట్టణంలోని 2, 3 వార్డుల పరిధిలోని 2వ సచివాలయంలోజగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గురజాల ఆర్డీవో హాజరై మాట్లాడారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలు రుసుము ఏమీ చెల్లించకుండా ఉచితంగా తీసుకోవచ్చునని చెప్పారు. గతంలో ఈ పత్రాల కోసం రోజుల తరబడి తిరగాల్సి ఉండేదన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సచివాలయ పరిధిలో 365 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారున. కార్యక్రమంలో తహశీల్దార్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు జైలుద్దీన్, కొమ్ము ముక్కంటి, కౌన్సిలర్లు మధుసూదన్‌రావు, కె.శ్రీనివాసరావు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని ఉంగుటూరులో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. వివిధ అంశాలపై 305 అర్జీలు రాగా వాటిని పరిష్కరించి ధ్రుపత్రాలు ఇచ్చినట్లు ఎంపిడిఒ మాధురి తెలిపారు. కొన్ని సమస్యల పరిష్కారానికి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.



కుంచనపల్లి అరటి తోటలో నిలిచిన వర్షపు నీరు

చిర్రావూరిలో రైతులతో మాట్లాడుతున్న నాయకులు





కరివేపాకు తోటలో నిలిచిన వర్షపు నీరు

రైతుల్ని ముంచిన ముంపు

- నీట మునిగిన పొలాలను పరిశీలించిన రైతు సంఘం నేతలు
- నష్టపోయిన రైతుల్ని తక్షణం ఆదుకోవాలి
- ఎకరాకు రూ.7 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : గత నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు వంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామంలో రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన ముంపుకు గురైన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు మొలకెత్తిన వరి పైరులన్నీ నీట మునిగాయన్నారు. చిర్రావూరు గ్రామంలోని సుమారు 170 ఎకరాలు వరి పైరు నీట మునిగిందని, తాడేపల్లి మండలంలోని చిర్రావూరు, గుండిమెడ, ఇప్పటం గ్రామాలలో పంటలు నీట మునిగాయని తెలిపారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఎకరాకు రూ.50వేల నుండి 70వేల వరకు వెద పద్ధతి వరికి ఖర్చు అయ్యాయని చెప్పారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.7వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా పంట పొలాలు ముంపునకు ప్రధాన కారణం నూతక్కి నుండి చిర్రావూరు ప్రాతూరు మీదుగా తాడేపల్లి వరకు రోడ్డు కిరువైపులా ఉన్న డ్రైనేజీ కాలువలు రోడ్డు విస్తరణలో భాగంగా పూడుకుపోయాయన్నారు. దీంతో వర్షపు నీరు అధికంగా చేరి, పొలాలు ముంపునకు గురయ్యాయన్నారు. పంట పొలాల ఇరువైపులా ఉన్న మురుగు కాలువలను పూడిక తీయించి, పంట పొలాలు ముంపునకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం చిర్రావూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రం అధికారిని ఎస్ శాంతిశ్రీని కలిసి నీట మునిగిన వరి పొలాల రైతులను ఆదుకోవాలని వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు మేడూరి పాములు, కౌలు రైతులు పల్లపాటి సుబ్బారావు, నారం శెట్టి బిక్షాలరావు, పల్లపాటి అనిల్ కుమార్, వల్లం శెట్టి కాళీ కృష్ణ, పాల్గొన్నారు.



చిర్రావూరు రైతు భరోసా కేంద్రంలో వినతి పత్రం ఇస్తున్న జొన్న శివశంకరరావు, డి వెంకటరెడ్డి తదితరులు

రైతుల గోడు పట్టని అధికారులు

భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి : రైతుసంఘం

ప్రజాశక్తి-తెనాలి : భారీ వర్షాలకు ముంపునకు గురైన పంట పొలాలను గురువారం ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి పరిశీలించారు. ఐతానగర్, తేలప్రోలు, కంచర్లపాలెం, నేలపాడు గ్రామాల్లో రైతులు మేకల చిట్టిబాబు, వేజళ్ల నాగేశ్వరరావు, జెట్టి సుబాకర్‌ల ద్వారా నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యవసాయాధికారి తెనాలి డివిజన్ పర్యటనకు వచ్చి పొలాలను పరిశీలించకుండా వెళ్లడం దారుణమన్నారు. కేవలం ఏడిఏ కార్యాలయానికే పరిమితమై, ఐదుగురు రైతులను మాత్రమే పిలిచి విచారించటాన్ని తప్పుబట్టారు. దాదాపు 30 శాతం రైతులు వెద పద్ధతిలో వరి సాగు చేశారని, ఎకరానికి రూ.ఏడు నుంచి 8 వేల వరకు ఖర్చుచేశారన్నారు. వర్షాలకు ఎద పెట్టిన వరి దెబ్బతిటుందని, మరలా వెద పెట్టాలన్నా, నాట్లు వేయాలన్నా ఎకరానికి రూ.15వేల వరకూ ఖర్చువుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈనేపధ్యంలో పంట నష్టాన్ని అధికారులు అంచనా వేసి, నష్టపోయిన రైతాంగానికి నష్ట పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఈదర పూర్ణచంద్, రైతులు తుల్లిమిల్లి నాగేశ్వరరావు, కన్నెగంటి భాస్కరరావు, మేకల ప్రసాదరావు, మంద్రు బాలస్వామి, మేకల మధు, బేతాళ చిన్ని, పిల్లి బాబురావు పాల్గొన్నారు.



తెనాలి మండలంలో రైతులతో కలిసి పొలాల పరిశీలనలో రైతు సంఘం నాయకులు



నీళ్లల్లో నానుతున్న కాలనీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని ఎమ్మెల రామయ్య కాలనీ, ఇస్లాంపేట, డాల్డా కంపెనీ, సుందరయ్య నగర్‌లోని కొన్ని ప్రాంతాలు, బోటు యార్డు ల్లో వర్షం నీరు చేరింది. దీంతో ఆ ప్రాంతంలో నివశిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు వర్షం వచ్చినా తమకు ఇబ్బందులు తప్పడంలేదని స్థానికులు వాపోతున్నారు. శాశ్వతంగా వర్షం నీరు రాకుండా మరమ్మతులు చేయాలని తాము చేస్తున్న విజ్ఞప్తులు అధికారుల ముందు అరణ్యరోదనలుగా మారాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకొని నీరు బయటకు వెళ్లే విధంగా చూడాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరు తున్నారు.







పొంచి ఉన్న ప్రమాదం

వర్షాలు అధికంగా కురిసి లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ముందని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు, వేముల దుర్గారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి జ్వరాలు ప్రబలకుండా. దోమలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

గిడ్డంగుల్లోకి వర్షపు నీరు

ప్రజాశక్తి-తాడేపల్లి

రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా గల సెంట్రల్ వేర్‌హౌస్ గిడ్డంగుల సముదాయంలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో లోడింగ్ అన్‌లోడింగ్ పనులు నిలిచిపోయాయి. ఎప్పుడు వర్షాలొచ్చినా వేర్‌హౌస్‌లోకి వర్షపు నీరు వచ్చి చేరుతుందని ముఠా కార్మికలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు గిడ్డంగుల్లో మెరక తోలించి సిమెంటు రోడ్లు వేయాలని కార్మికులు కోరుతున్నారు.

బాధితులకు ఆదుకోవాలని సిపిఎం ధర్నా

కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ - రత్నాలచెరువులో పలు రాజకీయపార్టీల పరిశీలన

ప్రజాశక్తి - మంగళగిరి

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన రత్నాల చెరువులోని ఎస్టీ కాలనీలో ఇళ్లల్లోకి నీరు చేరాయి. బాధితులకు ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం 12వ సచివాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని, ఇళ్లల్లోకి నీరు చేరిన కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం చేయాలని విన్నవించారు. అదేవిధంగా మగ్గాల షెడ్డుల్లోకి నీళ్లు చేరిన కుటుంబాలను ఆదుకోవాలని, ఇప్పటికే బాధితులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి బాలకృష్ణ, మున్నంగి చలపతిరావు, ఎం చంద్రారావు, కే వెంకటేశ్వరరావు, బి స్వామినాథ, గోలి దుర్గాప్రసాద్, జై భార్గవ, డి నాగేష్, ఎం మహాలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.



రత్నాల చెరువులో టిడిపి నాయకుల పర్యటన

ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

మంగళగిరి : అధిక వర్షాలతో ముంపునకు గురైన రత్నాల చెరువులోని ఎస్టీ కాలనీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పరిశీలించారు. త్వరలో డ్రైన్ పూడికతీత పనులను చేసి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో తాసిల్దార్ జిబి రాంప్రసాద్, డి ఈ కృష్ణారెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపి బృందం పరిశీలన

మంగళగిరి : జలమయమైన రత్నాలచెరువులోని ఎస్‌టి కాలనీలో టిడిపి బృందం పరిశీలించారు. బాధితులకు అల్పాహారం అందజేశారు. కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సాయం ప్రభుత్వం అందజేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందం అబద్దయ్య, పోతినేని శ్రీనివాసరావు, దామర్ల రాజు, జి ధనుంజయ రావు, పి మహేష్, కే అంకమ్మరావు పాల్గొన్నారు.

జనసేన, సిపిఐ సందర్శన

మంగళగిరి : ఇటీవల కురిసిన వర్షాలు వలన రత్నాల చెరువులోని ఎస్టీ కాలనీలో ఇళ్లకి నీరు చేరాయి. ఈ ప్రాంతాన్ని గురువారం సిపిఐ, జనసేన పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే బాధితులను కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్ బాబు, కంచర్ల కాశయ్య, జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, మునగపాటి వెంకట మారుతీ రావు, తిరుమల శెట్టి కొండలరావు, పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, బాధితులు

సహాయక చర్యలు ముమ్మరం

మంగళగిరి : ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రత్నాల చెరువులో ఎస్టీ కాలనీ జల దిగ్బంధంలో చిక్కుకుంది. నివాస నివాస గృహాలు నీట మునగటంతో స్థానిక ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలకు ఉపక్రమించారు. సమీపంలోని చర్చిలో బాధితులకు ఆశ్రయం కల్పించారు. ఇప్పటికే టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసిన విషయం విదితమే.



అధికారులకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

విద్యుత్ చార్జీలు తగ్గించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి -మంగళగిరి : పెంచిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీలోని సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా జరిగింది. అనంతరం సచివాలయ అడ్మిన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ మాట్లాడుతూ కరెంటు కాల్చుకున్న దానికంటే ఇతర చార్జీలతో కలిపి ఎక్కువ వస్తుందని అన్నారు. పేదలు నివసించే పూరిపాకలకు కూడా రూ.400 నుండి రూ.600 వరకు కరెంట్ బిల్లు వస్తుందని అన్నారు. పెంచిన ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ఎం చలపతిరావు, కే వెంకటేశ్వరావు, బి స్వామినాథ, ఎం చంద్రారావు, జే భార్గవ, డి నాగేష్, ఎం మహాలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

సంస్కృతీ సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరు జెడ్‌పి పాఠశాలలో 'జన్ భాగీదారి' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలు, జానపద పాటలు, ఇతర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు ప్రదర్శన ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు.



అరవిందబాబును కలిసిన ముదిరాజ్ నాయకులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

టిడిపి నరసరావుపేట ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మర్యాద పూర్వకంగా కలిసినట్లు ముదిరాజ్ సాదికార కమిటీ నరసరావుపేట పార్లమెంట్ కన్వీనర్ ఎం.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈ మేరకు స్థానిక రాగన్నపాలెంలోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ముదిరాజ్ సంఘం పల్నాడు జిల్లా కమిటీని ఏర్పాటుపై అరవిందబాబుతో చర్చించామని, ఆందుకు ఆయన సహకరిస్తామని చెప్పారని అన్నారు. అరవిందబాబును కలిసిన వారిలో అంజిబాబు, పి.వీరాంజనేయులు, కె.కోటేశ్వరరావు, ఎస్.సాయిశర్మ, ఎస్.బుజ్జి ఉన్నట్లు తెలిపారు.



చెరువును పరిశీలిస్తున్న ప్రజాప్రతినిదులు, అధికారులు

తాగునీటి చెరువుకు సాగర్ జలాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణం గార్లపాడు రోడ్డులోని తాగునీటి చెరువును మునిసిపల్ ఛైర్పర్సన్ చల్లంచర్ల లక్ష్మి తులసి సాంబశివరావు గురువారం సందర్శించారు. సాగర్ జలాలను కాల్వల ద్వారా 8 విద్యుత్ హెవీ మోటార్ల పైపుల సాయంతో చెరువులోకి నింపుతున్నట్లు చెప్పారు. సాగర్ జలాలు వచ్చినన్ని రోజులు జాగ్రత్తగా చెరువులోకి మళ్ళించే విధానంలో, వానాకాలం దష్ట్యా ప్రజలకు తాగునీటి సరఫరాలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చెరువు మొత్తం నీటితో నిండితే పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య ఉండదన్నారు. పరిశీలనలో కమిషనర్ షమ్మి, ఎఇ సాగర్, కౌన్సిలర్స్ సెగ్గెం వెంకటేశ్వరావు, పెద్దింటి చిట్టి, చెంచిరెడ్డి సిబ్బంది కిరణ్ పాల్గొన్నారు.

ఘర్షణపై పరస్పర విమర్శల పర్వం

- ఎమ్మెల్యేపై హత్యాయత్నం చేశారన్న మంత్రి విడదల రజిని
- ఎమ్మెల్యేపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్న టిడిపి





క్షతగాత్రుని ఎక్స్‌రేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి రజిని

ప్రజాశక్తి - వినుకొండ

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై టిడిపి శ్రేణులు హత్యాయత్నానికి పాల్పడ్డాయని, వారి చర్యలను ఖండిస్తున్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడుదల రజిని అన్నారు. వినకొండలో ఘర్షణ నేపథ్యంలో పట్టణానికి గురువారం వచ్చిన ఆమె వినుకొండ, నరసరావుపేట ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి,, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నిరసన పేరుతో టిడిపి శ్రేణులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును గంటలపాటు కారులో నిర్బంధించి కారు పై దాడి చేశారని అన్నారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో టిడిపి లేదని అందుకు ఇటువంటి ఘర్షణ వాతావరణ సృష్టిస్తున్నారని విమర్శించారు.

ఎవర్నీ వదిలిపెట్టం

ఘర్షణలో గాయపడ్డ శావల్యాపురం మండలానికి చెందిన వైసిపి నాయకులు అంకారావును ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు. అంకా రావుకు ఛాతి భాగంలో దెబ్బ తగిలినట్లు తెలిపారు. తమ పార్టీ నాయకులపై కార్యకర్తలపై దాడి చేసిన వారిని ఎవర్నీ వదిలిపెట్టబోమని, చట్టపరంగా శిక్షలు తప్పవని హెచ్చరించారు.

లోకేశ్ పాదయాత్రను అడ్డుకునే కుట్రలో వైసిపి ప్రభుత్వం : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పల్నాడులో నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో అలజడి సృష్టించడానికి వైసిపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. స్థానిక పండరిపురంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. లోకేశ్ పాదయాత్ర ప్రవేశించడానికి ముందే ఉద్రిక్త పరిస్థితులు సృష్టించి లోకేశ్ పాదయాత్రను అడ్డుకోవడానికి వైసిపి ఎత్తుగడ వేస్తోందన్నారు.



ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడివి నియంతృత్వ పోకడలు, అవినీతిపై శాంతియుతంగా నిరసన చేస్తున్న టిడిపి శ్రేణులపైకి ఎమ్మెల్యే వెళ్లడమేంటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



వినుకొండలో టిడిపి కార్యకర్తపైలపై వైసిపి దాడి ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదమని టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మండిపడ్డారు. పల్నాడు జిల్లాలో పోలీసులు శాంతిభద్రతను గాలికి వదిలేశారని, వైసిపి గుండాలు దాడులను అడ్డగించకపోగా ప్రోత్సహించారని ఆరోపించారు. టిడిపి శ్రేణులపై కేసులు పెట్టడం పరిపాటైందని, పద్ధతి మార్చుకోకుంటూ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ

వైసిపి దాడులు, దౌర్జన్యాలను టిడిపి శ్రేణులు ధైర్యంగా ఎదుర్కొని నిలబడతాయని తెలుగు యువత పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు సుధీర్ అన్నారు. మండల కేంద్రమైన బెల్లంకొండలోని టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అవినీతిని, వనరుల దోపిడీని ప్రశ్నించినందుకు టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు, కార్యకర్తలపై అక్రమ కేసు బనాయించారని, అధికార పార్టీకి తొత్తులుగా కొంతమంది పోలీసులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైసిపి అరాచకాలను చూస్తూ ఊరుకోబోమన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, సర్పంచ్ జి.సముద్రం, నాయకులు జి.కొండయ్య, రామకృష్ణ, వి.వెంకటేశ్వర్లు, హుస్సేన్ పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేలో అవకతవకలకు తావివ్వొద్దు

పరిశీలనలో పాల్గొన్న ఆర్‌డిఒ అద్దయ్య



పరిశీలనలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ అద్దయ్య

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఓటర్ల సర్వేలో అవకతవకలకు తావివ్వొద్దని బిఎల్వోలు సరిగా విధులు నిర్వహించాలని గురజాల ఆర్డీవో అద్దయ్య అన్నారు. పట్టణంలోని 2 వార్డ్ నందు గల 290 బూతులు ఓటర్ల పత్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఓటర్ల పత్రాలను ఆయన పరిశీలించి బూతులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఓట్లు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్ని పార్టీల బూతు లెవల్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. సర్వేలో ఎటువంటి వివాదాలూ జరగకూడదని, అవకతవకలు జరిగితే తమ దష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. వాలంటీర్లు ఎవరు కూడా బిఎల్వోల వెంట ఉండి ఓటర్ల సర్వేలో పాల్గొనకూడదని స్పష్టం చేశారు. ఆయన వెంట తహశీల్దార్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా పలుచోట్ల నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి నరసరావుపేటలోని వైసిపి కార్యాలయంలో, పట్టణంలోని పల్నాడు రోడ్డులో గల కలాం విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పూల మాలలేసి నివాళులర్పించారు. టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి పల్నాడు జిల్లా అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్, జనసేన కార్యాలయంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని నివాళులర్పించారు. భారతదేశానికి ఎంతో నిబద్ధతతో నిస్వార్థంగా విశేష సేవలందించిన మహనీయుడు, మహామనిషి కలాం అని కొనియాడారు. సామాన్య కుటుంబంలో జన్మించి కష్టపడి చదువుకొని ఎంతో ఉన్న స్థాయికి ఎదిగారని చెప్పారు. దేశ రక్షణ రంగానికి కావల్సిన మిస్సైల్ అభివృద్ధితో పాటు హృద్రోగులకుస్టంట్లను అతి తక్కువ ధరలకే అందుబాటులోకి వచ్చాయంటే అందుకు కలాం పరిశోధనలే కారణమని చెప్పారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు ఎంపిపి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సత్యవతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి అల్లు సత్యవతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపిపి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.వెంకటేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మిగిలిన సిసి రోడ్ల నిర్మాణాలు, డ్రెయినేజీ నిర్మాణాలు, తాగునీటి సరఫరా పనులను పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, గ్రామాల్లో ఫాగింగ్ నిర్వహించాలని, డ్రెయినేజీ ఎక్కడా నిలిచిపోకుండా చూడాలని చెప్పారు. గుంతల్లో పడిన వర్షపు నీరు వల్ల దోమల పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా ఎప్పటికప్పుడు పారిశుద్య పనులు చేయాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ కాశయ్య, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో బిజెపి మూకల హింసను ఖండించండి

ప్రజాశక్తి - తాడేపల్లి

మణిపూర్‌లో హింసకు పాల్పడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి డిమాండ్ చేశారు. గురువారం ఉండవల్లిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. బిజెపి అధికారం వెలగబెడుతున్నమణిపూర్ లో మహిళలను నగ్నంగా ఊరేగించిన అమానుష ఘటనను ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. శాంతి భద్రతలను కాపాడలేని ముఖ్యమంత్రి రాజీనామా చేయాలన్నారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదిర్శ వల్లభాపురం వెంకటేశ్వరరావు మాట్లాడుతు మణిపూర్ మారణహోమం సృష్టిస్తూ దేశ ప్రతిష్టను దిగజారుస్తున్న బిజెపికి ఎపిలో వంత పాడుతున్నవారు ఇప్పటికైన తమ విధానాలు మార్చుకోవాలన్నారు. **ప్రజాశక్తి - మంగళగిరి** :మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలపై మంగళగిరి నియోజకవర్గ సిపిఐ ఆధ్వర్యంలో గురువారం మంగళగిరి అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ మణిపూర్ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కంచర్ల కాసియా, జాలాది జాన్ బాబు, పి నాగేశ్వరావు, వై గోపి, ఏ ప్రభాకర్, నందం బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.



ఉండవల్లిలో నిరసన


సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి

పేదలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందించండి

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక జిల్లా వైద్యశాలను గురువారం మాజి మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. పలు వార్డుల్లో రోగుల ద్వారా ఆసుపత్రిలో అందుతున్న సేవలను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణిని ఆయన కలిశారు. ఆసుపత్రిలో వైద్యసేవలపై అనేక పిర్యాదులున్నాయని, పూర్తిస్థాయిలో మందులు కూడా రోగులకు అందించటంలేదని, మందులు బయట కొనుగోలు చేయాల్సిందిగా రోగులకు పురమాయిస్తున్నట్లు పిర్యాదులు న్నాయని, మరికొన్ని అవినీతి ఆరోపణలను ఆమెకు వివరించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆమెను కోరారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ డెల్టాకే తలమానికంగా ఉన్న వైద్యశాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఏ కేసు వచ్చినా గుంటూరుకు పంపుతున్నారన్నారు. ఇక్కడ వైద్యం ఎందుకు అందించలేకపోతున్నారని ప్రశ్నించారు. పేదలు ఉచిత వైద్యసేవలకోసం వస్తే వారికి మందులు బయట కొనుగోలు చేయాలని చెప్పటమేమిటని ప్రశ్నించారు. కనీసం పూర్తిస్థాయిలో మందులు కూడా అందించలేని దుస్థితిలో ఆసుపత్రి ఉండటం బాధకరమన్నారు. ఇప్పటికైనా రోగులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. ఆయన వెంట నాయకులు టి.హరిప్రసాద్, అన్నం పిన్నారావు, రహంతుల్లా భేగ్ పాల్గొన్నారు.



జగనన్న సురక్షతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - మంగళగిరి

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. నగరంలోని చిల్లపల్లి కళ్యాణ మండపం, ఈద్గా కమ్యూనిటీ హాల్స్‌లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి ముఖ్య అతిథిలుగా పాల్గొని పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా, ఎలాంటి రుసుము లేకుండా ఆదాయ, కుల ధ్రువీకరణ, జనన, మరణ, మ్యుటేషన్, రేషన్ కార్డులు, ఆధార్ సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు వలంటీర్లు నేరుగా దరఖాస్తు దారుల ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను 99 శాతం నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రానున్న ఎన్నికల్లోను ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

కెఎల్‌యులో ఉస్తాద్ చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

కెఎల్ ఫిల్మ్ క్లబ్ అధ్వర్యంలో ఇట్స్ షో టైమ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉస్తాద్ చిత్ర బృందం హాజరయి విద్యార్థులను అలరించారు. సాక్ డైరెక్టర్ సాయి విజయ్ మాట్లాడుతూ ఇట్స్ షో టైమ్ అనే కార్యక్రమం విశ్వవిద్యాలయం యొక్క శక్తివంతమైన చలనచిత్ర సంస్కృతిని ప్రదర్శించిందన్నారు. అత్యంత ప్రశంసలు పొందిన వారాహి చలన చిత్రం ఉస్తాద్ కథానాయకుడు ఫణిదీప్, కథానాయకి కావ్య కళ్యాణిరామ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయి విద్యార్థులు రూపొందించిన లఘు చిత్రాలను వీక్షించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీలోని ప్రతిభావంతులైన విద్యార్థులు రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌లు, డాక్యుమెంటరీలు, ఇతర సినిమా లను ప్రదర్శించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రొఫెసర్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విధ్యార్ధి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ఫిలిం క్లబ్ మెంటార్ వేణు తదితరులు పాల్గొన్నారు.





రోటరీ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో

ఉచిత దంత వైద్యశిబిరం

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

పొన్నూరు రోటరీ సర్వీస్ సొసైటీ మెటర్నిటీ మరియు చైల్డ్ హెల్త్‌లో భాగంగా మండల పరిధిలోని వల్లభరావు పాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల మరియు ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో 50మంది విద్యార్థులకు ఉచితం గా దంత పరీక్షలు నిర్వహించి పేస్టులు, బ్రెష్ లు అందచేశారు. విద్యార్థులకు పుస్తకాలు ,పెన్నులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.గ్రామంలో ఉన్న అంగన్వాడీ స్కూలలో తల్లులకు రోటరీ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసరావు డాక్టర్ కొండబోలు సీతా రామయ్య, డాక్టర్ రవి రాకేష్ దేవ్‌తదితరులు పాల్గొన్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలిగా సరోజిని ఏకగ్రీవం

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్



ఇన్నర్ వీల్ క్లబ్ పొన్నూరు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జీబీసీ రోడ్డులో గల కొత్తమాసు. పద్మజ గురువారం ఇంట్లో జరిగింది. 2023-24 ప్రెసిడెంట్‌గా సరోజిని ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. గత సంవత్సరం ప్రెసిడెంట్ శివ నాగ బ్రహ్మణి బాధ్యతలు నూతన ప్రెసిడెంట్ సరోజిని కు అందజేశారు. ఇన్స్టలేషన్ ఆఫీసర్‌గా కె. పద్మజ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రాధిక, సబలాదేవి , కవిత, విజయలక్ష్మి ఇతర ఇన్నర్ వీల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తాడికొండ

ఈనెల 30న విజయవాడ లోని పీబి సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరుగనున్న కార్మిక, కర్షక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ, జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి కోరారు. నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ బస్టాండ్ సెంటర్లో గురువారం ఈ మేరకు గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ముప్పాళ్ళ శివశంకరరావు, చింతల భాస్కరరావు, కనగాల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

రోడ్డుపైన నాట్లు వేసి టిడిపి నిరసన

రహదారి కూడా వేయించలేని ఎమ్మెల్యే రాజీనామా చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-తెనాలి :నాలుగేళ్ళగా కనీసం రోడ్లు కూడా వేయటం చేతకాని ఎమ్మెల్యే రాజానామా చేయాలని పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. హనుమాన్‌పాలెం-గుంటూరు మెయిన్ రోడ్డులో ఖాజీపేట వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంశమై, భారీగా నీరు చేరి కనీసం ద్విచక్ర వాహనాలు కూడా నడిచేందుకు వీలులేని పరిస్థితిపై వారు నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై నిలిచిన నీళ్ళలో నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కల్లబొల్లి కబుర్లు చెప్పిన ఎమ్మెల్యే, నాలుగేళ్ళలో ప్రధనాంగా ఉన్న ఒక్క రోడ్డును బాగు చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎంపిపి కేసన కోటేశ్వరరావు మాట్లాడుతూ కనీసం పాఠశాల విద్యార్థులు, విద్యాసంస్థల వాహనాలు కూడా నడవలేని దుస్థితిలో రోడ్లు ఉన్నాయన్నారు. అధికార పార్టీ నాయకులు అభివృద్ధి, సంక్షేమం అంటూ గొప్పలు చెప్పుకోవటం మినహా చేసిందేమీ లేదన్నారు. ప్రజల కష్టాలను ఇప్పటికైనా పరిశీలించి, రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉన్నం జాన్‌బాబు, స్తుద్దపల్లి కిరణ్, పలువురు స్థానిక మహిళలు పాల్గొన్నారు.





వరద ఉధృతిని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తాడేపల్లి

సీతానగరం వద్ద కృష్ణానది వరద ఉధృతిని స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎంటిఎంసి కమిషనర్ యు.శారదాదేవి గురువారం పరిశీలించారు. నదీ పరివాహక ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉదయం నుంచి క్రమక్రమంగా పెరుగుతున్న వరద ఉధృతిని ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. నీటి మట్టాన్ని అంచనా వేసి గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు చేయాలని సూచించారు. నదిలోకి ఎవరూ వెళ్లకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని కోరారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు మున్నేరు, కట్టలేరు, పాలేరు, బుడమేరుల నుంచి కృష్ణానదికి వరద వచ్చి చేరుతుంది. బ్యారేజీ ఉన్న 40 గేట్లను రెండు, 30 గేట్లను అడుగు మేర ఎత్తి 80 వేల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి వదలుతున్నారు.

సొంత పార్టీలోనే ఘోరమైన అవమానం

అందుకే రాజీనామా : ఎంపిటిసి అరుణ

ప్రజాశక్తి-తెనాలి

సొంత పార్టీలోనే అవమానంకరంగా మాట్లాడటం, కులం పేరుతో దూషించటం.. ఆపై దాడికి పాల్పడటం.. అది చాలక నాపై కేసులు బనాయించటం.. ఇంతకంటే సిగ్గుచేటు మరొకటి లేదు. పైగా నిందితులకు ఎమ్మెల్యే కొమ్ము గాయటం సహించలేకపోతున్నా. అందుకే వైసిపికి, ఆ పార్టీ ద్వారా సంక్రమింఇన పదవికి రాజీనామా చేస్తున్నానంటూ రూరల్ గ్రామం అంగలకుదురు-2 ఎంపిటిసి పేరం అరుణ కన్నీటిపర్యంతమయ్యారు. మండల పరిషత్ అధ్యక్షులు చెన్నుబోయిన శ్రీనివాసరావుకు ఆమె లిఖిత పూర్వకంగా రాజీనామా లేఖను గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా గ్రామ అభివృద్ధిని కాంక్షించి, మట్టి తరలింపుపై ప్రశ్నిస్తే, మహిళలనని కూడా చూడకుండా వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షులు హైమారావు తనపై పైశాచికంగా దాడిచేశారని, దానిని ఖండించాల్సిన శాసనసభ్యులు, అతనికి వత్తాసు పలుకుతన్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసిన పోలీసులు కూడా దర్యాప్తులో తాత్సారం చేయటంతో, సొంతపార్టీలో అవమానాన్ని భరించలేక రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న నేపధ్యంలో సొంతపార్టీ నాయకుల తిరుగుబాటు ఎమ్మెల్యేకు తలనొప్పిగా పరిణమించింది. మూడు నెలల క్రింతం జరిగిన మండల పరిషత్ సమావేశంలో కొలకలూరుకు చెందిన వైసిపి ఎంపిటిసి కాలిశెట్టి ఫణికుమార్ కూడా గ్రామంలో అభివృద్ధి కుంటుపడిందని, ఎమ్మెల్యేకు, అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదంటూ రాజీనామా అస్త్రాన్ని సంధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తాజాగా వైసిపికే చెందిన ఎంపిటిసి పేరం అరుణ రాజానామా కూడా పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.. మొత్తం మీద నియోజకవర్గంలో క్రమంగా ఎమ్మెల్యేపై అసమ్మతి రాగం ఊపందు కుంఉటందని పార్టీ వర్గాలే చర్చించుకోవటం గమనార్హం.


ఎంపిపికి రాజీనామా లేఖ అందిస్తున్న ఎంపిటిసి అరుణ

బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డులు-2024కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు. దేశంలోని ప్రతిభావంతులైన పిల్లలను సత్కరించడం ఈ అవార్డుల ముఖ్య ఉద్దేశం అని, రాష్ట్రపతి చేతులమీదుగా ఈ అవార్డులు ప్రదానం చేయబడతాయన్నారు. ఇతరుల కోసం అసాధారణమైన ధైర్యసాహసాలతో, నిస్వార్థమైన పనులను చేసిన యువ ధైర్యవంతులకు, అసాధారణమైన సామర్థ్యాలు, అత్యుత్తమ విజయాలు కలిగిన చిన్న పిల్లలకు తగిన గుర్తింపును ఇవ్వడానికి ఈ అవార్డులు అందజేస్తారన్నారు. ఇతరులకు ఆదర్శంగా ఉండే వారు, క్రీడలు, సామజిక సేవ, సైన్సు అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి, నూతన ఆవిష్కరణలు మొదలైన వాటిలో విస్తృత అవగాహన కలిగి ఉండేవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. భారతీయ సంతతికి చెందిన బాలలు, 2023 ఆగస్టు 31 నాటికి నిండని వారు అర్హులని తెలిపారు. అర్హులైన బాలలు ఆన్‌లైన్‌లో https://awards.gov.in ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఆగస్టు 31 ఆఖరు తేదీ అని తెలిపారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.



గ్రీన్ క్రాప్స్ లైఫ్ స్టైల్ వారి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ, ఇతర అధికారులు

విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచాలి : డిఇఒ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పాతబస్టాండ్‌లో గల పరీక్ష భవన్‌లో జిల్లాలోని గుంటూరు, తెనాలి విద్యా డివిజన్లకు చెందిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల ఇన్‌స్పైర్ మానక్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పేరుపొందే విధంగా మంచి సైన్స్ ప్రాజెక్టులను తయారు చేయాలని, ప్రతి పాఠశాల నుంచి సైన్స్ ప్రాజెక్ట్ ఉండే విధంగా కృషి చేయాలని, విద్యార్థులను సైన్స్ పట్ల ఆసక్తి కలిగే విధంగా తీర్చిదిద్దాలని అన్నారు. గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఖర్చుపెట్టి విద్యార్థులకు అందించిన బైజూస్ ట్యాబ్‌లను, పాఠశాలలకు అందించిన ఐఎఫ్‌సి ప్యానల్‌లను సమర్థవంతగా పాఠశాలల్లో వినియోగించాలని అన్నారు. కార్యక్రమంలో తొలుత మాజీ రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రీన్ క్రాప్స్ లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిఇబి సెక్రెటరీ లలితా ప్రసాద్, ఎ.తిరుమలేష్, జిల్లా సైన్స్ అధికారి ఎ.రవికుమార్, ఉర్దూ డిఐ యండి. ఖాసిం, యన్‌జిసి కోఆర్డినేటర్ వి.రామాంజనేయులు, డాక్టర్ సాంబశివరావు, పి.మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఆర్‌విఆర్‌అండ్‌జెసిలో వనమహోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

హరితాంధ్రప్రదేశ్ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వనమహోత్సవ్, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాల్లో భాగంగా ఎఐసిటిఇ ఆదేశాల మేరకు గురువారం కళాశాలలో మేరీ మిట్టీ మేరీ దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం అధ్యాపక, అధ్యాపకేతర బృందం, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొని కళాశాల ఆవరణలో, పరిసర ప్రాంతాల్లో భారీ సంఖ్యలో మొక్కలు నాటారు. బ్రిటీష్ వారి బానిస సంకెళ్ల నుండి విముక్తి కలిగించి స్వేచ్ఛా వాయువుని అందించేందుకు ఎందరో మహనీయులు ప్రాణత్యాగాలు చేశారని, వారిని స్మరించుకుంటూ భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన జీవనానికి మంచి పర్యావరణం అవసమని అందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ మెగా ప్లాంటేషన్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మొక్కలు అందచేసిన అటవీ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు, పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయ డానికి ఆగష్టు 13వ తేదీ బైపాస్‌రోడ్డులోని అమరావతి ఐకాన్‌లో చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నట్లు బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ తెలిపారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్స్ మూడు విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. 8, 9, 10 తరగతుల సీనియర్స్ విభాగంలో దేశమును ప్రేమించు మన్న చరణాలపై, 6, 7 తరగతులు జూనియర్స్ విభాగంలో తమకు ఇష్టమైన స్వాతంత్ర్య సమరయోధుడు గురించి, 3, 4, 5 సబ్ జూనియర్స్ విభాగంలో జెండా వందనం గురించి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 13వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని వివరించారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఆగస్టు పదో తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పేర్లు నమోదుకు 9490099559 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. పోటీలు జరిగే కేంద్రంలో డ్రాయింగ్ షీట్ మాత్రమే నిర్వాహకులు అందిస్తారని తెలిపారు. మిగిలిన మెటీరియల్ మొత్తం చిత్రకారులే తమ వెంట తెచ్చుకోవాలన్నారు. విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. పాల్గొన్న ప్రతిఒక్కరికీ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. ఎటువంటి ప్రవేశ రుసుము లేదన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికి, నైపుణ్యత వెలికితీయడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9866029 486కు ఫోన్ చేయాలని కోరారు. ఈ సందర్భ ంగా వృత్తికళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.జగన్ పాడిన చదవాలిరా ఎన్ని ఆటంకా లొచ్చిన పాట ఉత్తేజపరిచింది. సమావేశంలో ప్రజాశక్తి సిజిఎం వై అచ్యుతరావు, యడ్ల బాలకృష్ణ, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఉపాధ్యక్షులు జిఎస్ఆర్ మోహనరావు, శ్రీలక్ష్మి, విశ్రాంత ఎంపిడిఒ ఆదినారాయణ, అమరావతి బాలోత్స వం కార్యదర్శి ఐజాక్ న్యూటన్, పిఇటి రమేష్, మోహన్‌బాబు, రియాజ్ బాష, ఆర్‌వి రాఘవయ్య, అంజిరెడ్డి, ఫిరోజ్, అనుదీప్ కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగన్

ఎఎస్‌ఎన్ ఫార్మసీలో జాతీయ సెమినార్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్‌ఎన్ ఫార్మసీ కళాశాల్లో ఆజాదికా అమృత్ మహోత్సవ్, జి-20 దేశాల సదస్సులో పిలుపు మేరకు గురువారం 'రీసెంట్ ట్రెండ్స్ అండ్ ఇన్నోవేషన్స్ ఇన్ ఫార్మా హెల్త్‌కేర్ సిస్టమ్' అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఏఎస్‌ఎన్ ఐపిఎ-ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఎడ్యుకేషన్ డివిజన్ చైర్మన్ డాక్టర్ ఎస్.విధ్యాధరరావు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐపిఎ ఎస్‌ఎఫ్ 2008 ఆగస్టు 16న మిసైల్‌మేన్‌గా పేరొందిన మాజీ రాష్ట్రపతి ఏపిజే అబ్దుల్ కలాం ప్రారంభించారన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని నేషనల్ సెమినార్ నిర్వహించటం అభినందనీయమన్నారు. జన విజ్ఞానవేదిక జిల్లా అద్యక్షులు, కొట్నీస్ ప్రజావైద్య శాల వైద్యులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి మాట్లాడుతూ ఏఎస్‌ఎన్ ఫార్మీసి కళాశాల ఐపిఎ ఎస్‌ఎఫ్‌ను 2019 జనవరి నాలుగున ప్రారంభించినట్లు గుర్తు చేశారు. ఫార్మసీలో నూతన ఆవిష్కరణలపై బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసి ప్రిన్సిపాల్ డాక్టర్ టిఇ గోపాలకృష్ణమూర్తి వివరించారు. నేషనల్ సెమినార్ అర్గనైజింగ్ సెక్రటరీ, ఏపిటిఐ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ కె.వెంకటరమణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ వై.ఫణికృష్ణ, ఐపిఎస్‌ఎఫ్ నేషనల్ అద్యక్షులు జ.సాయినాధ్‌చారి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



సెమినార్‌లో పాల్గొన్న డాక్టర్ విద్యాధరరావు, డాక్టర్ సాంబిరెడ్డి తదితరులు

సుమేధా హైస్కూల్లో అబ్దుల్ కలాం వర్ధంతి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధ హైస్కూల్లో మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలాం యువఫౌండేషన్ ఫౌండర్ అండ్ ట్రస్టీ పిడికిటి భూపాల్ హాజరై విద్యార్థులకు కలాం గొప్పతనం గురించి వివరించారు. అనంతరం టెన్త్ విద్యార్థులకు కలాం పుస్తకాలను పంచిపెట్టారు. మంచి మార్కులు సాధించి స్కూల్‌కు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సుమేధాలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భూపాల్, చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులు


గీతాంజలి హైస్కూల్లో ..

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక ఏటి అగ్రహారం, రామిరెడ్డి నగర్, గీతాంజలి హైస్కూల్లో గురువారం భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. ముందుగా గీతాంజలి స్కూల్ డైరెక్టర్ షేక్ హుస్సేన్ మాస్టారు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అబ్దుల్ కలాం నిరుపేద కుటుంబం నుంచి వచ్చి, ఒక పేపర్ బాయ్‌గా పనిచేస్తూ వచ్చిన డబ్బులతో పుస్తకాలు కొనుక్కొని చదివి ఈరోజు ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగారన్నారు. జీవితాంతం దేశ ప్రతిష్ట కోసం తపించిన దేశభక్తుడని అన్నారు. విద్యార్థులు అబ్దుల్ కలాం స్ఫూర్తితో శాస్త్రవేత్తలుగా, ఇంజినీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం షేక్ షాంషాద్‌భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిజిజిబి ఖాతాదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి-గుంటూరు

ఖాతాదారులకు లాకర్ సదుపాయంతోపాటు, మెరుగైన సేవలు అందించేందకు యనమదలలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌ను విశాలమైన నూతన భనంలోకి మార్చారు. గురువారం ఈ నూతన భవనం ప్రారంభ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.హరిహరనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాతా దారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందించటంలో గ్రామీణ బ్యాంకులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. మార్కెట్ పరిస్థితులకు అతీతంగా సమాజంలో అన్ని వర్గాల కస్టమర్లకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేందుకు డిపాజిట్లపై అత్యధికంగా 8.75శాతం వడ్డీని సిజిజిబి అందిస్తుందని చెప్పారు. బ్యాంక్ జనరల్ మేనేజర్ పి.మారుతీరాం మాట్లాడుతూ మొత్తం వ్యాపారం రూ.18వేల కోట్లు అదిగమించినందుకు, ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.89 కోట్లు నికర లాభం సాధించినందుకు ఖాతా దారులకు అభినందనలు తెలిపారు. అలాగే విదేశాల్లో ఉన్నత చదువుల కోసం బ్యాంకు గడిచిన రెండేళ్లలో 600 మంది గ్రామీణప్రాంత విద్యార్థులకు విద్యా రుణాలను అందించిందని, రైతుల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ఎటువంటి తనఖా లేకుండా రూ.3 లక్షల వరకూ రుణ సదుపాయం కల్పించబోతున్నట్టు తెలిపారు. బంగారు నగల తనఖాపై గ్రాముకు అత్యుత్తమంగా రూ.4350లు వరకూ అందిస్తుమన్నాని, బ్యాంకులో పొదుపు చేసే ప్రతి డిపాజిట్ రుణరూపేణ అత్యధికంగా రైతులు, మహిళల సాధికారత కోసం బ్యాంక్ కేటాయిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజర్ పి.వీరారెడ్డి, బ్యాంకు ప్లానింగ్ మేనేజర్ కె.ఆంజనేయులు, బ్రాంచ్ మేనేజర్లు వై.శ్రావణ్, కె.శ్రీకాంత్, బ్రాంచి సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు మెగా చెక్కు అందచేస్తున్న డిఆర్‌డిఎ పీడీ, బ్యాంకు అధికారులు